## నేడు నల్లగొండకు డెడికేటెడ్ కమిషన్ రాక

- ఉమ్మడి జిల్లా బీసీ, ఇతర కుల సంఘాల నుంచి వినతుల స్వీకరణ

నల్లగొండ, నవంబర్ 15 : స్థానిక సంస్థల రిజర్వేషన్ల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం నియమించిన డెడికేటెడ్ కమిషన్ శనివారం జిల్లాకు రానుంది. రిటైర్డ్ ఐఏఎస్, డెడికేటెడ్ చైర్మన్ బూసాని వెంకటేశ్వర్ రావు, ఐఎఫ్ఎస్ బి. సైదులు ఆధ్వర్యంలో ఈ కమిటీ నేడు నల్లగొండ కలెక్టరేట్‌లో ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు ఉమ్మడి నల్లగొండ నుంచి బీసీ సంఘాలు, ఇతర సంఘాల నుంచి స్థానిక సంస్థల రిజర్వేషన్ల విషయమై వినతులు స్వీకరించనున్నారు. ప్రభుత్వ సూచన మేరకు దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలనే ఆలోచనతో ఈ కమిషన్ ఆయా కుల సంఘాల నుంచి అభ్యర్థనలు, ఆక్షేపణలు, సలహాలతోపా పలు అంశాలపై ప్రజాభిప్రాయ సేకరణ చేయనున్నట్లు కలెక్టర్ ఇలా త్రిపాఠి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కులాల స్థితిగతులపై అవగాహన ఉన్న ఆర్గనైజేషన్లు, కుల సంఘాలు.. స్థానిక సంస్థల్లో కల్పించాల్సిన రిజర్వేషన్లపై తగు సలహాలు, వినతులు ఇవ్వాలని ఆమె సూచించారు. వీటికి సంబంధించి పూర్తి స్థాయిలో తమ వద్ద ఉన్న ఆధారాలతో ఇవ్వాలని తెలిపారు.

## బోనస్ ఎగ్గొట్టడానికి ప్రభుత్వం కొర్రీలు

- 90 శాతం మంది రైతులు సన్నవడ్లను మిల్లుల్లోనే అమ్ముతున్నారు
- మాజీ మంత్రి కేటీఆర్‌కు వివరించిన రైతుబంధు సమితి మాజీ జిల్లా అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి


బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిటెంట్ కేటీఆర్‌తో మాట్లాడుతున్న చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి

మిర్యాలగూడ, నవంబర్ 15 : హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌ను శుక్రవారం రైతుబంధు సమితి నల్లగొండ జిల్లా మాజీ అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి కలిశారు. ఈ సందర్భంగా ఆయన కేటీఆర్‌తో మాట్లాడుతూ ఎన్నికల ముందు రేవంత్‌రెడ్డి రైతులు పండించిన అన్ని రకాల పంటలకు క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తామని చెప్పి ఇప్పుడు కేవలం సన్నరకం ధాన్యానికి మాత్రమే ఇస్తానని రైతులను మోసం చేస్తున్నారని అన్నారు. సన్నరకం ధాన్యం తేమశాతంతోనే అమ్మాలి కాబట్టి 90శాతం మంతి రైతులు నేరుగా రైస్ మిల్లులకు, ప్రైవేట్ సంస్థలకు ధాన్యాన్ని అమ్ముకుంటున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు పూర్తి స్థాయిలో బోనస్ ఇవ్వాలంటే ఎకరానికి 25 క్వింటాళ్ల నుంచి 30 క్వింటాళ్ల దిగుబడికి రూ.12,500 నుంచి రూ.15వేల వరకు బోనస్ ఇవ్వాల్సి వస్తుందని, అందుకే కొనుగోలు కేంద్రాల్లో అమ్మి ధాన్యానికి మాత్రమే ఇస్తామని చెబుతున్నారని చెప్పారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో క్వింటాకు రూ.2,600 నుంచి రూ.2,800వరకు ధాన్యానికి మద్దతు ధర రాగా కాంగ్రెస్ ప్రభుత్వంలో రూ.2,200 నుంచి రూ.2,300 వరకే రావడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. రైతులు ధాన్యాన్ని ఎక్కడ అమ్మినా కూడా మద్దతు ధర రూ.2,320తోపాటు బోనస్ రూ.500 కలిసి మొత్తం రూ.2,820 ఇచ్చేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని ఆయన కేటీఆర్‌ను కోరారు.

# దేదీప్యమానం


## కనుల పండువగా కార్తిక పౌర్ణమి వేడుకలు

## ఆలయాల్లో ప్రత్యేక పూజలు.. దీపారాధనలు


కార్తిక పౌర్ణమి సందర్భంగా దీపాల వెలుగులో పిల్లలమర్రి శివాలయాలు

రామగిరి, నవంబర్ 15 :కార్తిక పౌర్ణమి వేడుకలను శుక్రవారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ఉదయం తెల్లవారుజామునే ఆలయాల్లో దీపాలు వెలిగించారు. శివాలయాల్లో అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రముఖ క్షేత్రాలు యాదగిరి గుట్ట, చెర్వుగట్టు, ఛాయా, పచ్చల సోమేశ్వరాలయం, వాడపల్లి, మఠంపల్లి, పిల్లలమర్రి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. సాయంత్రం పలు ఆలయాల్లో జ్వాలాతోరణం వంటి కార్యక్రమాలు కనుల పండువగా జరిపారు. అర్వపల్లి యోగానంద లక్ష్మీనర్సింహ స్వామి దేవస్థానంలో జరిగిన స్వామివారి కల్యాణ వేడుకలో మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యేగుంటకండ్ల జగదీశ్ రెడ్డి, సునీత, మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్, కమల దంపతులు, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ గుజ్జ దీపికా యుగంధర్‌రావు పాల్గొన్నారు.


చెర్వుగట్టులో శివలింగం ఆకారంలో దీపారాధన


అర్వపల్లి : యోగానందుడి కల్యాణోత్సవంలో పాల్గొన్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కిషోర్‌కుమార్ కుటుంబ సభ్యులు


పచ్చలసోమేశ్వరాలయంలో యువతి పూజలు


నల్లగొండ ఛాయా సోమేశ్వరాలయంలో భక్త జన సందడి


నేరేడుచర్ల ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ హుజూర్‌నగర్ నియోజకవర్గ నాయకుడు ఒంటెద్దు నర్సింహారెడ్డి

## రైతుల గోస పట్టని రేవంత్‌రెడ్డి

- ప్రతి గింజా కొనుగోలు చేసే వరకూ బీఆర్ఎస్ పోరాటం
- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఒంటెద్దు నర్సింహారెడ్డి

నేరేడుచర్ల, నవంబర్ 15 : నేరేడుచర్ల వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, పార్టీ హుజూర్‌నగర్ నియోజకవర్గ సమన్వయ కర్త ఒంటెద్దు నర్సింహారెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడి రైతులతో మాట్లాడగా, వారు తమ గోడును వివరించారు. గత పది రోజులుగా ధాన్యం ఆరబోయడానికి అధికారులు పట్టాలు ఇవ్వడం లేదని తెలిపారు. ఈ సమయంలో వ్యవసాయ అధికారులతో కొంత వాగ్వాదం జరిగింది. అనంతరం నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. రైతులను జైల్లో వేసే సీఎం రేవంత్‌రెడ్డికి రైతుల ఎలా గోస పడుతుందని ఎద్దేవా చేశారు. ప్రతి గింజా కొనుగోలు చేసే వరకూ బీఆర్ఎస్ పార్టీ రైతుల పక్షాన పోరాటం చేస్తుందని తెలిపారు. కాగా, అప్పటి వరకు రైతులకు పట్టాలు అందించని అధికారులు, వెంటనే పట్టాలు ఇస్తామని హామీ ఇచ్చారు. దీంతో రైతులు ఒంటెద్దు నరసింహారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ దొండపాటి అప్పిరెడ్డి, మండలాధ్యక్షుడు అరిబండి సురేశ్‌బాబు, మాజీ మున్సిపల్ చైర్మన్ చందమళ్ల జయబాబు, మాజీ ఎంపీపీ చెన్నబోయిన సైదులు, బీఆర్ఎస్ పట్టణ, మండల ప్రధాన కార్యదర్శులు చిత్తలూరి సైదులు, యల్లబోయిన లింగయ్య, హుజూర్‌నగర్ మాజీ జడ్పీటీసీ కొప్పు సైదిరెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కడియం వెంకట్‌రెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ జక్కుల నాగేశ్వర్‌రావు, నేరేడుచర్ల మాజీ గ్రంథాలయ చైర్మన్ గుర్రం మార్కండేయ, నియోజకవర్గ నాయకులు కేఎల్ఎన్ రెడ్డి, చిల్లేపల్లి పీఏసీఎస్ మాజీ చైర్మన్ అనంతు శ్రీను, నాయకులు రాపోలు నవీన్, ఇనపాల పిచ్చిరెడ్డి, మర్రు శ్రీనివాస్, గురవయ్య, నాగార్జున, సైదిరెడ్డి, శ్రీను, భరత్ తదితరులు ఉన్నారు.

## 6 గంటల్లోపు ధాన్యాన్ని మిల్లులకు పంపాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి


నకిరేకల్ : గోరెంకలపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రంలో తేమ శాతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నకిరేకల్, నవంబర్ 15 : రైతులు కేంద్రానికి ఏ రోజు ధాన్యాన్ని తీసుకొస్తే ఆ రోజే కొనుగోలు చేయాలని, 6 గంటల్లోపు ధాన్యాన్ని కొని మిల్లులకు పంపించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి నిర్వాహకులను ఆదేశించారు. నకిరేకల్ మండలంలోని గోరెంకలపల్లి, మంగళపల్లి గ్రామాల్లో శుక్రవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ధాన్యం, తేమ శాతాన్ని పరిశీలించారు. తాలు, తరుగు, మట్టి పెల్లలు వంటివి లేకుండా ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని రైతులకు సూచించారు. వ్యవసాయ శాఖ అధికారులు పరిశీలించి ధ్రువీకరించిన తర్వాతే ధాన్యాన్ని లిఫ్ట్ చేయాలన్నారు. ఆమె వెంట ఆర్‌డీఓ అశోక్‌రెడ్డి, డీసీఓ పాత్యానాయక్, ఐకేపీ ఏపీఎం నరహరి, సెంటర్ ఇన్‌చార్జి శ్రీకాంత్ ఉన్నారు.

## ఉమ్మడి జిల్లా రైఫిల్ షూటింగ్ జట్టు ఎంపిక


ఉమ్మడి జిల్లా రైఫిల్ షూటింగ్ జట్టుతో విశ్వజ్ఞచారి

కోదాడ రూరల్, నవంబర్15 : పట్టణ పరిధి వాగ్దేవి కళాశాలలో ఎస్‌జీఎఫ్ 68వ క్రీడల్లో భాగంగా శుక్రవారం ఉమ్మడి నల్లగొండ జిల్లా రైఫిల్ షూటింగ్ జట్టు ఎంపిక పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌జీఎఫ్ జిల్లా అసిస్టెంట్ కార్యదర్శి వెలిది విశ్వజ్ఞచారి మాట్లాడుతూ పీసీపీ, ఓపెన్ సైట్, పిస్టల్ విభాగాల్లో అండర్ - 14, అండర్ - 17 బాల, బాలికల విభాగాల్లో 32 మంది సభ్యులతో కూడిన జట్టును ఎంపిక చేసినట్లు తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలల నుంచి 50 మంది బాలురు, 40 మంది బాలికలు పాల్గొన్నారని అన్నారు. అండర్ - 14 రైఫిల్ విభాగంలో ఆరుగురు బాలురు, బాలికలు, అండర్ - 17 విభాగంలో ఆరుగురు బాలురు, బాలికలు, పిస్టల్ విభాగంలో అండర్ -14కు ఇద్దరు బాలికలు, అండర్-17 విభాగంలో ఇద్దరు బాలికలు, పీసీపీలో అండర్ -14 విభాగంలో ఇద్దరు బాలికలు, ఇద్దరు బాలురు రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా జట్టుకు ఎంపికైనట్లు చెప్పారు. ఎంపికైన విద్యార్థులు త్వరలో హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రటరీ మైసయ్య, కోచ్‌లు అంజి, నాని, పీడీలు కొండల్, రంగారావు, బ్రహ్మారెడ్డి, ప్రభాకర్‌రావు, పదీప్, అరుణ తదితరులు పాల్గొన్నారు.

## అమెరికా అందాల పోటీలో చండూరు అమ్మాయి



చండూరు, నవంబర్15 : అమెరికాలో తెలుగువారు వివిధ రంగాల్లో ప్రతిభను చాటుతున్నారు. చండూరు మండల కేంద్రానికి చెందిన బావండ్ల రిషిత అమెరికా అందాల పోటీల్లో గెలుపొంది ఖండాంతర ఖ్యాతిని చాటింది. 2024-25 సంవత్సరానికిగానూ నవంబర్ 11న వాషింగ్టన్‌లో జరిగిన మిస్ టీన్ ఇండియా డబ్ల్యూ ఏ, మిస్ ఫిలాంత్రఫీ యూనివర్స్ పోటీల్లో గెలుపొందగా ఈ నెల14న అవార్డు అందుకున్నట్లు ఆమె తండ్రి బావండ్ల మాణిక్యం తెలిపారు. మాణిక్యం పద్నాలుగు సంవత్సరాల క్రితం అమెరికాకు వెళ్లి అక్కడే స్థిరపడ్డారు. రిషిత ఈ నెల 25న చండూరుకు రానున్నట్లు ఆమె తండ్రి పేర్కొన్నారు.

## పొద్దంతా ఆరబోత.. సాయంత్రం కుప్పపోత

- కొద్ది రోజులుగా రైతులకు అకాల వర్ష భయం
- కాంటాలు వేయకపోవడంతో కొనుగోలు కేంద్రాల్లో అవస్థలు


నేరేడుచర్ల మార్కెట్‌లో ఆరబోసిన ధాన్యాన్ని కుప్ప చేసి పట్టా కప్పుతున్న రైతులు

నేరేడుచర్ల, నవంబర్ 15 : ఆరుగాలం కష్టించి పంట సాగు చేసిన రైతులు బాధలు చెప్పలేనివి. పంట అమ్ముకోవడానికి నానా అవస్థలు పడుతున్నారు. చేతికందిన ధాన్యాన్ని దళారులకు విక్రయించి నష్టపోకుండా మద్దతు ధరకు కొనుగోలు చేసేందుకు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. మద్దతు ధర ప్రకటించడంతో ఆశతో కొంత మంది అన్నదాతలు కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తరలిస్తున్నారు. అయితే కొద్ది రోజులుగా తూకాలు ప్రారంభించకపోవడంతో రైతులు ధాన్యం కుప్పల వద్ద పడిగాపులు పడుతున్నారు. మబ్బులు పట్టడంతో ఉదయం ధాన్యం ఆరబోసి సాయంత్రం కుప్పలుగా చేసి పట్టాలు కప్పుతున్నారు. కొంతమంది రైతులు ఈ బాధలు చూడలేక ధర తక్కువకైనా రైస్ మిల్లులకు విక్రయిస్తున్నారు.

### పొగమంచు.. మబ్బులు పట్టడమే కారణం

సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వం 310 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి 3.70లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరిచాలనే లక్ష్యం. మిషన్ కోతలు, వర్షాభావ పరిస్థితుల కారణంగా లక్ష్యం సాధ్యం కాదని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. సన్న ధాన్యానికి మద్దతు ధర క్వింటాల్‌కు ఏ గ్రేడు రూ. 2,320, సాధారణ రకానికి రూ. 2,300తోపాటు రూ. 500 బోనస్‌ను ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. దీంతో కొంత మంది రైతులు కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకెళ్లి ప్రభుత్వ నిబంధనల మేరకు ధాన్యం శుభ్రం చేసి తేమ శాతం తగ్గడం కోసం అరబెడుతున్నారు. గత కొద్ది రోజులుగా ఇదే తంతు జరుగుతున్నది. మరో వైపు తరచూ మబ్బులు పట్టడం, వర్షం కురవడం, దట్టమైన పొగమంచు కారణంగా ధాన్యం కాపాడుకోవడానికి రైతులు నానా అవస్థలు పడుతున్నారు. కొనుగోలు కేంద్రాల్లో నిల్వ చేసిన ధాన్యం ఉదయం సమయంలో ఆరబోయడం, సాయంత్రం కుప్ప పోయాల్సిన దుస్థితి నెలకొంది. కొన్ని కేంద్రాల్లో ధాన్యం రాశులమీద కప్పడానికి సరైన టార్పాలిన్లు లేవు. ధాన్యం కాంటాలు ప్రారంభికపోవడం, ఆలస్యంగా కొనుగోళ్లు జరుగడంతోనే ఈ సమస్య వస్తున్నదని రైతులు అంటున్నారు. ఇప్పటికైనా కొనుగోళ్లు వేగవంతం చేయాలని కోరుతున్నారు.

# చేప పిల్లల విడుదలలో నయా మోసం

## చేప పిల్లల క్వాలిటీ, క్వాంటిటీలో చాలా తేడా

- పదించుల పిల్లలు పోస్తామని మూడించులే పోస్తున్న కాంట్రాక్టర్లు
- పోసేటప్పుడు లెక్కల్లోనూ మాయాజాలం
- రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకొని నిలదీసిన ఎమ్మెల్యేలు వీరేశం, బత్తుల
- అయినా పట్టించుకోకుండా చెరువుల్లోకి నాణ్యత లేని చేపపిల్లలు విడుదల

నల్లగొండ, నవంబర్ 15 : ఈ నెల 11న నకరేకల్‌లోని పెద్ద చెరువులో చేప పిల్లలను వదిలే సమయంలో చేప పిల్లల లెక్కల్లో తేడా ఉందని అనుమానం రావడంతో స్థానిక ఎమ్మెల్యే వీరేశం దగ్గరుండి లెక్కించగా 13,500 చేప పిల్లలు తక్కువగా వచ్చాయి. దాంతో మరునాడు పోస్తామని కాంట్రాక్టర్లు అప్పటికి తప్పించుకున్నారు. ఈ నెల 14న అడవిదేవుల పల్లి మండలంలోని టెయిల్ పాండ్‌లో చేపలు పోసే సమయంలో పది ఇంచుల చేపలు పోస్తామని చెప్పిన అధికారులు మూడు ఇంచుల చేపపిల్లలు మాత్రమే పోయడానికి తేవటంతో స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ససేమిరా వద్దు అని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసి అక్కడ నుంచి వెళ్లిపోయాడు. ఆ తర్వాత కాసేపటికే అదే టెయిల్ పాండ్‌లో తెచ్చిన పిల్లలను వదిలి వెళ్లిపోయారు. ఇది జిల్లాలో ఉచిత చేప పిల్లల విడుదల్లో కాంట్రాక్టర్లు చేస్తున్న మాయాజాలం. 'పార్టీ కార్యకర్తలం మేము.. అధికారంలో ఉన్న పార్టీ మాది' అనుకున్నారేమో గానీ మొత్తానికి బరితెగించారు ఈ చేప పిల్లల కాంట్రాక్టర్లు. అధికారులు చెప్తే ఖాతరు చేయలే.. సొసైటీ వాళ్లు మొత్తుకుంటే పట్టించుకోలే.. ఉచిత పిల్లల్లో క్వాలిటీ లేదు, క్వాంటిటీలో పారదర్శకత లేకుండా చెరువుల్లో పోస్తున్న చేప పిల్లల్లో అక్రమాలు ఏమిటని ఏకంగా అధికార పార్టీ శాసన సభ్యులే రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకొని నిలదీసినప్పటికీ మార్పు రాకపోవడం గమనార్హం.

### రూ.రెండు కోట్ల రూపాయలు పక్కదారి

సర్కార్ లెక్కల ప్రకారం నల్లగొండ జిల్లాలో మొత్తం 2.98 కోట్ల చేప పిల్లలు పోయాల్సి ఉండగా అందులో 2.05కోట్ల పిల్లలు 80 ఎంఎం నుంచి 100 ఎంఎం వరకు, 93లక్షల చేప పిల్లలు 30 ఎంఎం నుంచి 40 ఎంఎం వరకు పోయాలి. క్షేత్ర స్థాయిలో మాత్రం 30 నుంచి 40 ఎంఎం చేప పిల్లలు మాత్రమే పోస్తూ 80, 90, 100 ఎంఎం చేప పిల్లలు కూడా పోస్తున్నట్లు చెప్పుకొస్తున్నారు. 30ఎంఎం నుంచి 40 ఎంఎం చేప పిల్లలకు ప్రభుత్వం రూ.0.55 చెల్లిస్తుండగా.. 80 ఎంఎం నుంచి 100 ఎంఎం చేప పిల్లకు రూ.1.47 ఇస్తున్నది. జిల్లాలో మొత్తం 2.98 కోట్ల చేప పిల్లల్లో చిన్న సైజ్ చేప పిల్లలకు రూ.51.15 లక్షలు అవుతుండగా పెద్ద సైజ్ చేప పిల్లకు రూ.3.01కోట్ల చొప్పున మొత్తం రూ.3.52 కోట్లు ప్రభుత్వం ఖర్చు చేస్తున్నది. కాంట్రాక్టర్లు పెద్ద సైజ్ చేప పిల్లలు తీసుకొచ్చి చెరువుల్లో పోయకుండా చిన్న పిల్లలనే పోసి మమ అనిపిస్తున్నారు. పెద్ద చేప పిల్లల పేరుతో రూ.1.88కోట్లు వారి జేబుల్లో వేసుకునే ప్రయత్నం చేస్తున్నారు.



### కైకలూరు నుంచి నల్లగొండకు..

జిల్లాలో ఈ నెల 4వ తేదీ నుంచి ఉచిత చేప పిల్లల పంపిణీ చేపట్టగా ఇప్పటి వరకు 1.10 కోట్ల వరకు పలు చెరువుల్లో పోశారు. నల్లగొండ జిల్లాలో టెండర్ వేసిన నలుగురు అధికార పార్టీ కాంట్రాక్టర్లకు ఫిష్ సీడ్ ఫామ్స్ లేకపోయినప్పటికీ ప్రభుత్వ పెద్దల ఒత్తిడితో వారికే టెండర్లు ఫైనల్ చేశారు. అయితే వారు కైకలూరు నుంచి నాణ్యత లేని, సైజ్‌లెస్ సీడ్ పోస్తున్నట్లు మత్స్య కారులు అంటున్నారు. అక్కడ నుంచి తేవడం వల్లనే ప్రమాదకరమైన డెవిల్, క్యాట్ ఫిష్ వచ్చినట్లు వారి ఆరోపణ. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన రెండో ఏడాది నుంచే రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో వంద శాతం సబ్సిడీతో మత్స్యకారుల కుటుంబాల్లో జీవన విధానం మెరుగుపడాలనే ఉద్దేశంతో ఈ ఉచిత చేప పిల్లల విడుదలను చేపట్టింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలో జరిగిన టెండర్ల తర్వాత జిల్లాలో ఫిష్ నర్సరీలు లేవని, చిన్నవి ఉన్నా..అందులో ఫిష్ సీడ్ సరిపోను లేదని మత్స్య శాఖ యంత్రాంగం టెండర్లు రద్దు చేసి అధికార పార్టీ కాంట్రాక్టర్లకు ఇచ్చింది. కానీ వారు నాణ్యత లేనివి పోయడంతో అధికార పార్టీ శాసన సభ్యులే ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.